సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 21 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికింది. మార్కెట్‌కు 21 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరి రూ.8 పలికింది. 1,470 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/8.7°

జిల్లాలో శుక్రవారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పబ్లిక్ పరీక్షల్లోనూ సత్తా చాటాలి

- కలెక్టర్ బసంత్‌కుమార్



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

కొత్తచెరువు: మండల కేంద్రంలోని తలమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ బసంత్‌కుమార్ తనిఖీ చేశారు. ఎస్‌ఏ–1 పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లోనూ విద్యార్థులు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మంచి మార్కులు తెచ్చుకుని తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. ప్రణాళికబద్ధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

స్థల సేకరణ వేగవంతం చేయండి

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థల సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. పుట్టపర్తి పట్టణంలో రెడ్‌క్రాస్ సొసైటీ భవనం, రైతు బజారు, సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్, టూరిజం భవన నిర్మాణాలకు ఎనములపల్లి పొలంలో దుర్గమ్మ గుడి, పెరేడ్ గ్రౌండ్ ఏరియాలో అధికారులు గుర్తించిన భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. అలాగే, పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం, గణేష్ కూడలి షాదీమహల్ వద్ద ఉన్న 11 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా భవన నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్, తహసీల్దార్ నవీన్‌కుమార్, పుడా వీసీ నరేష్‌కృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ అధికారి విశ్వనాథరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఖయ్యూం, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏ ఎన్నికల్లోనైనా గెలిచాడా?

- లోకేష్‌పై ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: అసెంబ్లీకి గాని, పంచాయతీ సర్పంచ్ స్థానానికి గాని, కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని వ్యక్తి నారా లోకేష్.. అలాంటి వ్యక్తి 'యువగళం' పేరుతో యాత్ర చేసినా వైఎస్సార్‌సీపీకి వచ్చే నష్టమేమీ లేదు' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన అనంతపురంలో జరిగిన వైఎస్సార్‌సీపీ కన్వీనర్ల సమావేశానికి ముందు మంత్రి ఉష శ్రీచరణ్‌తో కలిసి తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీని 23 స్థానాలకే పరిమితం చేశారన్నారు. 420 వ్యక్తులు టీడీపీకి నాయకత్వం వహిస్తున్నారని, ఫేక్ సర్వేలతో కార్యకర్తలను మోసం చేస్తున్నారని విమర్శించారు. నాలుగు చానళ్ల, నలుగురిని కూటమిగా పెట్టుకుని ఏమి చెప్పినా ప్రజలు నమ్ముతారనే భ్రమల్లో ఉన్నారన్నారు. అసలు రాష్ట్రంలో టీడీపీ ఉనికే లేదన్న విషయం గుర్తించాలన్నారు. 150 నియోజకవర్గాల్లో టీడీపీకి నాయకత్వమే లేదన్నారు. అయినా అధికారంలోకి వస్తే తాము ఏదో పీకుతామని ప్రగల్భాలు పలుకుతున్నారని.. వారిలా మేమూ అనుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని హెచ్చరించారు. ప్రచార యావతో ప్రజలను చంపడమే మీ ధ్యేయమా అని టీడీపీ నేతలను ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. భూములు, స్థలాలు ఆక్రమించడం, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం టీడీపీ నేతలకు అలవాటని విరుచుకుపడ్డారు. ఇప్పుడేదో సచ్ఛీలురు అన్నట్లు మాయ మాటలు చెప్తూ.. వైఎస్సార్‌సీపీని ఓడించండని ప్రజలకు పిలుపునిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు మాట్లాడుతున్న భాషను మహిళలు చీదరించుకుంటున్నారని పేర్కొన్నారు.

టీడీపీ నేతలవి దిగజారుడు రాజకీయాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులకు భయం పట్టుకుందని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. అందుకే దిగజారుడు రాజకీయాలకు దిగుతున్నారన్నారు. తాను అవినీతికి పాల్పడ్డానని ఆరోపణలు వచ్చిన వెంటనే.. ఖండిస్తూ.. వాస్తవ విషయాలను ఆధారాలతో సహా మీడియా సమక్షంలో విడుదల చేశానన్నారు. వాటిపై చర్చించేందుకు టీడీపీ నాయకులు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు.

త్రాసు.. తిరకాసు

- హిందూపురానికి చెందిన రమేష్ రెండు రోజుల క్రితం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ మాంసం దుకాణంలో రెండు కిలోల మటన్ కొనుగోలు చేశాడు. తూకంపై అనుమానపడిన ఆయన సమీపంలోనే మరో దుకాణానికి వెళ్లి మళ్లీ కొలిచాడు. 1.850 కిలోలే వచ్చింది. ఇదేంటని మొదట కొనుగోలు చేసిన దుకాణదారుడిని ప్రశ్నిస్తే నాకేం సంబంధం లేదు అంటూ రమేష్‌తోనే వాగ్వాదానికి దిగాడు. దీంతో చేసేదిలేక బాధితుడు వెనుదిరిగాడు.
- బుక్కపట్నం చెరువు కట్టపై ఉన్న ఓ చేపల మార్కెట్లో బండ రాళ్లతో ఓ మహిళ తూకం వేస్తుంది. పుట్టపర్తికి చెందిన రామలింగ అనే వ్యక్తి ఆమె వద్ద శుక్రవారం రెండు కిలోల చేపలు కొనుగోలు చేశాడు. స్వతహాగా వ్యాపారి అయిన రామలింగ ఇంటికెళ్లి తన వద్ద ఉన్న రాళ్లతో తూకం వేస్తే 1.7 కిలోలు వచ్చింది. చేపలమ్మిన మహిళ వద్దకు వెళ్లి ఇదేమని ప్రశ్నిస్తే.. తన రాళ్లు కరెక్టుగానే ఉన్నాయంటూ రామలింగనే దబాయించింది.

ఇవి కేవలం రెండు ఉదాహరణలే. జిల్లాలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమైపోయాయి. వ్యాపారుల మోసాలతో సాధారణ జనం దగా పడుతున్నారు.

- బహిరంగ మార్కెట్లలో అడుగడుగునా దగా
- వినియోగదారులను నిండా ముంచుతున్న కేటుగాళ్లు
- తూతూ మంత్రంగా తూనికలు, కొలతల శాఖ తనిఖీలు
- మామూళ్ల మత్తులో ఉన్నారనే ఆరోపణలు



కొత్త జిల్లా ఏర్పడిన నాటి నుంచి 2022 డిసెంబరు వరకూ వివరాలిలా..	
అధికారులు తనిఖీ చేసి నమోదు చేసిన కేసులు	263
జరిమానా	రూ.23,01,900
వసూలు చేసిన స్టాంపింగ్ ఫీజు	రూ.37,55,675

సాక్షి, పుట్టపర్తి: తూకాల్లో మోసం జిల్లాలో యథేచ్ఛగా సాగుతోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వ్యాపార కార్యకలాపాల్లో జరుగుతున్న తిరకాసుతో సాధారణ ప్రజలు దగా పడుతున్నారు. చేపల మార్కెట్‌లలో అయితే మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కొందరు వ్యాపారులు తక్కెడతో తూకాలు వేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. తరాజు, బాట్ల ద్వారా కొనుగోలు చేసిన సరుకుల్లో తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల డిజిటల్ వేయింగ్ మెషీన్లలోనూ కిలోకు 100 గ్రాముల వరకు దందా చేస్తున్నారు. దుకాణంలో ఓ వస్తువు కొనుగోలు చేసి ఇంటికెళ్లాక పరిశీలిస్తే తక్కువ తూకం ఉన్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. కాస్త మొగ్గు (ఎక్కువ) తూకం వేసినా.. అదే సరుకు తీసుకెళ్లి ఇంకో చోట తూకం వేస్తే సుమారు 50 గ్రాముల వరకు తేడా వస్తున్నట్లు చెబుతున్నారు. పౌర సరఫరాల దుకాణాల నుంచి అందే సరుకుల్లోనూ కిలోకు దాదాపు 250 గ్రాముల వరకూ నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్యాకింగ్‌లోనూ మోసాలు..

జిల్లా పరిధిలో ధర్మవరం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి పట్టణాల్లో సూపర్ మార్కెట్‌లు ఉన్నాయి. ఆయా చోట్ల సరుకులను డంపుగా నిల్వ చేసుకుని తమ లేబుల్ వేసుకుని ప్యాకింగ్ చేయించి విక్రయాలు చేస్తుంటారు. అయితే ప్యాకింగ్ చేసే సమయంలో ప్రతి కిలోకు 10 నుంచి 50 గ్రాముల వరకు తూకంలో తేడా ఉంటున్నాయి.

అంతా 'మామూళ్ల' వ్యవహారమే..

తూకాల్లో మోసాలను అరికట్టాల్సిన తూనికలు కొలతల శాఖ అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. పత్రికల్లో వార్తాకథనాలు వచ్చిన కొన్ని రోజులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి తర్వాత చేతులు దులుపుకుంటున్నారు. వ్యాపారులతో మామూళ్లు తీసుకోవడం వల్లే అధికారులు సరిగా స్పందించడం లేదని జనం నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

మాంసం కేంద్రాలు.. మోసాలకు అడ్డాలు

- కదిరి, హిందూపురం పట్టణాల్లో కొందరు మటన్ షాపు నిర్వాహకులు మాంసంపై నీళ్లు చల్లుతూ అధిక తూకం వచ్చేలా చేస్తున్నారు. కిలో మటన్‌పై కనీసం 100 గ్రాముల వరకు నీటిశాతం ఉండేలా దందా కొనసాగిస్తున్నారు.
- చికెన్ ధరలు కూడా ఆయా ప్రాంతాల్లో వేర్వేరుగా ఉంటున్నాయి. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి వద్ద కిలో చికెన్ రూ.200 ఉండగా.. ఎనుములపల్లిలో రూ.150 నుంచి రూ.180 మధ్య ఉంటోంది. ఇదేంటని అడిగితే పేపర్ ధరలని చెబుతున్నారు. నాణ్యత ఆధారంగా ధర నిర్ణయిస్తామంటూ మోసగిస్తున్నారు. .

తనిఖీలు చేస్తున్నాం



వాణిజ్య, వ్యాపార సంస్థల్లో తరచూ తనిఖీలు చేస్తున్నాం. మోసాలపై మాకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. వ్యాపారులు తూకం యంత్రాలు, తరాజు, బాట్లను ఏడాదికి ఒకసారి మార్చుకోవాలి.

– ఎం.మహమ్మద్ గౌస్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, పుట్టపర్తి డివిజన్ ఇన్‌చార్జి

నిబంధనలు పాటిస్తే.. సురక్షిత ప్రయాణం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్



వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తే సురక్షితంగా గమ్యాలను చేరుకోవచ్చని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గణేష్ సర్కిల్ నుంచి నిర్వహించిన 3 కిలోమీటర్ల వాకథాన్‌కు విద్యార్థులు, పట్టణ వాసులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించడాన్ని కర్తవ్యంగా భావించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే ప్రమాదాలు జరగవన్నారు. ప్రమాద రహిత జిల్లాగా శ్రీసత్యసాయిని నిలుపుదామని పిలుపునిచ్చారు. ఈనెల 24 వరకూ నిర్వహించనున్న వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వాకథాన్‌ను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటిస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీలు యశ్వంత్, ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని చోట్లా గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, సిద్దారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి

- సీఎం జగన్ ఆశయాలకనుగుణంగా పనిచేద్దాం
- ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం

పుట్టపర్తి: 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ గెలుపే లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకనుగుణంగా పనిచేస్తే విజయం సులువేనని పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గృహంలో గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. రాబోవు 15 నెలలు ఎంతో విలువైనవన్నారు. ఏమాత్రం ఏమరపాటుకు గురికాకుండా పనిచేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పని చేయాలని, ప్రతిపక్షాల కుట్రలను, ఎల్లో మీడియాలో వచ్చే తప్పుడు కథనాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

రేపు కానిస్టేబుల్ ప్రిలిమినరీ

- ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకూ పరీక్ష
- పకడ్బందీగా ఏర్పాట్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉమ్మడి జిల్లాలో ఆదివారం పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. పరీక్ష ఏర్పాట్లపై శుక్రవారం ఎస్పీ ఫక్కీరప్ప మీడియాతో మాట్లాడారు. ఈ నెల 22న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మొత్తం 47 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 24,055 మంది హాజరవుతారన్నారు. పరీక్ష సమయం కంటే గంట ముందే కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. హాల్ టికెట్లతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను మాత్రమే తీసుకురావాలని కోరారు. ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురాకూడదని సూచించారు. పరీక్షకేంద్రాల పర్యవేక్షణకు అనంతపురం రీజినల్ కో ఆర్డినేటర్‌గా అదనపు ఎస్పీ నాగేంద్రుడు, గుత్తి రీజినల్ కో ఆర్డినేటర్‌గా గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప వ్యవహరిస్తారని తెలిపారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. అనంతపురం, గుత్తి సెంటర్ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగాలిప్పిస్తామనే మాయగాళ్ల వలలో పడొద్దని అభ్యర్థులకు సూచించారు. అలాంటి వారు తారసపడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లేకుంటే 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

దేవుడిచ్చిన వరం పోలీసు వృత్తి



సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ రవిప్రకాష్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

- ఎట్టి పరిస్థితుల్లో తప్పులు చేయొద్దు
- ప్రజల్లో మరింత గౌరవం పెరిగేలా వ్యవహరించండి
- డీఐజీ రవిప్రకాష్

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు సేవ చేసేందుకు దేవుడిచ్చిన వరంగా పోలీసు వృత్తిని భావించాలని అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం కూడా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులుగా మనం గర్వపడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులు చేయరాదని సూచించారు. ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా వ్యవహరించాలన్నారు. పోలీసు వృత్తి ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చని, శాంతి భద్రతలు పరిరక్షించవచ్చని, దర్యాప్తులో నిజాలను వెలికి తీయవచ్చని.. ఇలా ఎన్నో సేవలద్వారా ప్రజలకు మంచి చేసే అవకాశం మనకుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ బాగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని గుర్తించుకుని విధులను నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాలును ప్రారంభించారు. పోలీస్ వాహనాలకు డ్రైవర్ల కొరత లేకుండా అనంతపురం ఎస్పీతో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

పరేడ్ గ్రౌండ్ పరిశీలన..

గణతంత్ర వేడుకలకు ముస్తాబవుతున్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను డీఐజీ రవిప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్‌తో కలిసి సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటైన బ్యాండ్ పార్టీ సిబ్బంది అద్భుత ప్రదర్శన కనబరచడంతో 12 మందికి నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీలు విజయ్‌కుమార్, ఉమామహేశ్వరరెడ్డి, యశ్వంత్, ఆర్‌ఐ శ్రీశైలంరెడ్డి, టైటాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం..

కదిరి: మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపాలని అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ ఆదేశించారు. మిగిలిన జిల్లాలతో పోలిస్తే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు ఈ విషయంలో మంచి ప్రతిభ కనబరిచాయని కితాబిచ్చారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌తో కలిసి కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకు మునుపు డీఐజీకి కదిరి డీఎస్పీ భవ్య కిషోర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. డీఐజీ స్టేషన్ ప్రాంగణంలో గుర్తుగా మొక్క నాటారు. కార్యక్రమంలో పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటేస్తే నోట్లిస్తాం!

'' తమ్ముడు...నేను మీ కాలనీలోనే ఉంటా. మీనాన్నకు, అన్నకు బాగా తెలుసు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నువ్వు మాకు సహకరించాలి. బెంగళూరు నుంచి నువ్వు వచ్చిపోయేందుకు రవాణా ఖర్చులతో పాటు డబ్బులు కూడా ఇస్తాం. తప్పకుండా రావాలి.''

- బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న హిందూపురానికి చెందిన ఓ యువకుడితో ఓ తెలుగు తమ్ముడి ఓటు మాట

''మీ గ్రామంలోని 30 మంది గ్రాడ్యుయేట్లకు ఓట్లున్నాయి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీరంతా మాకే ఓటేయాలి. మీకేం కావాలో చెప్పండి. ఆ 30 మందినీ ఓ సారి పిలిపించండి..కలిసి భోజనం చేద్దాం. కాసేపు మాట్లాడుకుందాం''

- రాప్తాడు నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన వారితో టీడీపీ నేత ఓటు రాజకీయం

...ఇలా టీడీపీ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నోటు రాజకీయం చేస్తున్నారు. ప్రజాభిమానం కోల్పోవడంతో ఉనికి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొందరి నోటుతో గాలం వేయడం, మరికొందరిని కులంకార్డు అడ్డుపెట్టుకుని మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. గ్రామాల వారీగా ఓటరు జాబితా తీసుకుని పల్లెలకే వెళ్లి తమ 'పనితనం' చూపుతున్నారు.

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ప్రలోభాలు
- ఓటర్ల ఆధార్ నంబర్లు, బ్యాంక్ అకౌంట్ల సేకరణ
- మందు, విందు సమావేశాలతో ఎర

సాక్షి, పుట్టపర్తి: నేరుగా ఎన్నికలకు వెళ్లి గెలిచే సత్తా లేక తెలుగుదేశం పార్టీ నేతలు అడ్డదారిలో వెళ్తున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటాలోని విధాన పరిషత్తు ఎన్నికల్లో గెలవడం సాధ్యం కాదని భావించి.. ఓటర్లకు ఎర వేస్తున్నారు. రాయలసీమలో ఇప్పటికే టీడీపీ కనుమరుగు కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం ఉనికి చాటుకునేందుకు ఆ పార్టీ నేతలు ఆపసోపాలు పడుతున్నారు. పట్టభద్రుల కోటాలో అభ్యర్థిని ఖరారు చేసిన టీడీపీ అధిష్టానం... ఉపాధ్యాయుల కోటాలో పోటీ చేసే అభ్యర్థి ఎంపిక చేసేందుకు మల్లగుల్లాలు పడుతోంది. మరోవైపు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తుండగా, ఆయా వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

ఆధార్, బ్యాంక్ నంబర్ల సేకరణ..

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలు ఉన్నాయి. మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా, ఇప్పటికే ఓటర్ల నమోదు ప్రక్రియ దాదాపు పూర్తయింది. ముందస్తు సర్వేలన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల హవానే సాగనున్నట్లు చెబుతున్నాయి. దీంతో దిక్కు తోచని తెలుగు తమ్ముళ్లు అడ్డదార్లు తొక్కుతున్నారు. మండలాల వారీగా ఓటర్ల ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు సేకరిస్తున్నారు. తమ పార్టీ (టీడీపీ) అభ్యర్థులకు ఓటు వేస్తే నగదు జమ చేస్తామని ఆశ చూపుతున్నారు. ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు సేకరించి జాబితా తయారు చేసుకుంటున్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులిలా..

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం
- రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ),
- కత్తి నరసింహారెడ్డి (పీడీఎఫ్)

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం
- వెన్నపూస రవీంద్రరెడ్డి (వైఎస్సార్‌సీపీ),
- భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి (టీడీపీ),
- పోతల నాగరాజు (పీడీఎఫ్)

చోటా నేతలకు బడా బాధ్యతలు..

ఇప్పటికే ఓ దఫా ఫోన్ సంప్రదింపులు ముగించిన టీడీపీ నేతలు.. తాజాగా ఓటర్లు నివాసం ఉంటున్న ప్రాంతాలకు వస్తున్నట్లు తెలిసింది. అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గ్రామాల వారీగా ఓటర్లను ఓ చోట కలిపి మందు.. విందు సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఓటర్లందరినీ ఒక చోటకు సమీకరించేందుకు ఆయా గ్రామాలవారికి ప్రత్యేక బాధ్యతలు కూడా అప్పగించినట్లు తెలిసింది. అలాగే, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తోన్న వారికి ఫోన్లు చేసి ప్రయాణ ఖర్చులు భరిస్తామని.. తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరినట్లు తెలిసింది.

రైళ్లలో చోరీల కట్టడికి చర్యలు

- డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి

గుంతకల్లు: రైళ్లలో చోరీల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డీఆర్‌ఎం అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. జీఆర్‌పీఎస్పీ కె.చౌడేశ్వరి, ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, ఏడీఆర్‌ఎం సూర్యనారయణ, మురళీకృష్ణ హాజరయ్యారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాల్లో ఆర్పీఎఫ్, జీఆర్పీ సంయుక్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నగేష్‌కుమార్, ఆర్పీఎఫ్ సీఐ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీగా గణతంత్ర వేడుకకు ఏర్పాట్లు



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రం పుట్టపర్తి సమీపంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను కలెక్టర్ బసంత్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి గణతంత్ర వేడుకలు నిర్వహించనున్న స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు. వేడుకలకు వచ్చే అధికారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్టాల్స్, శకటాలు, విద్యార్థుల ప్రదర్శనలు, మార్చ్‌ఫాస్ట్ వేదికలను పరిశీలించారు. జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న శకటాలు, స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఐ టైటాస్, తహసీల్దార్ నవీన్‌కుమార్, కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడికి మతి భ్రమించింది

- ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తనకల్లు: టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడికి మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తనకల్లులో విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేస్థాయి అయ్యన్నపాత్రుడికి లేదన్నారు. స్థాయి మరిచి నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మంత్రి ఆర్‌కే రోజాపై సభ్య సమాజం తలదించుకునేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రున్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఒక మహిళను ఉద్దేశించి మాట్లాడిన తీరును చూసి మీ ఇంట్లోని మహిళలు కూడా సిగ్గుతో తలదించుకొని ఉంటారని నిప్పులు చెరిగారు. మీ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. టీడీపీ నాయకులు ఉపయోగిస్తున్న భాషను చూస్తుంటే మహిళలపై వారికి ఎంతమాత్రం గౌరవం ఉందో ఇట్టే అర్థం అవుతోందని స్పష్టం చేశారు. అయ్యన్నపాత్రుడు ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టారని, నిబంధనల ప్రకారమే వాటిని ప్రభుత్వం తొలగించిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని అయ్యన్న ... సీఎం వైఎస్ జగన్‌పై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. నీ మీద కేసులు పెట్టే పరిస్థితులను నువ్వే తెచ్చుకొని ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలు చేస్తావా అని ప్రశ్నించారు. అధికారం దూరం కావడంతో ఉన్మాదిలా ప్రవర్తిస్తున్న అయ్యన్నపాత్రుడికి ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. పోలీస్ వ్యవస్థపై దారుణంగా విమర్శలు చేస్తున్న అయ్యన్నపాత్రుడు పోలీసులు లేకుండా బయట తిరగగలడా? అని ప్రశ్నించారు. ఎన్‌టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఏ రోజూ ఎన్‌టీఆర్ గురించి పట్టించుకోలేదన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్ ఎన్‌టీఆర్ చేసిన సేవలను గుర్తించి ఆయన పేరును కృష్ణా జిల్లాకు పెట్టారని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చిలమత్తూరు: మండలంలోని గాడ్రాలపల్లికి చెందిన సుధాకర్ (38) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు .. సుధాకర్ మద్యానికి అలవాటు పడి తరచూ ఇంట్లో గొడవపడేవాడన్నారు. మృతుడి కుమారులు, భార్య నిరంతరం మద్యానికి అలవాటు పడి పడితే ఎలా? మానుకోవాలని చెప్పారు. మనస్తాపం చెందిన సుధాకర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బరామ్‌నాయక్ తెలిపారు.

శుద్ధజలం కాదు.. బోరు బావి నీళ్లు



అనంత కేంద్రంగా వివిధ బ్రాండ్ల లేబుళ్లతో తయారు చేసిన వాటర్ బాటిళ్లు



బోరుబావిలో నీటిని నింపి వాటర్ బాటిళ్లకు లేబుల్ వేస్తున్న మహిళా కార్మికులు

- మినరల్ వాటర్ పేరుతో జోరుగా దందా
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌దాడుల్లో వెలుగు చూసిన మోసాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శుద్ధ జలం పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో జోరుగా సాగుతున్న నీటి దందా గుట్టును అధికారులు రట్టు చేశారు. బోరు బావుల్లోని నీటిని బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తేల్చారు. చాలా చోట్ల మినరల్ వాటర్ పేరుతో పలు బ్రాండ్ల పేరు మీద మార్కెట్లో లభించే వాటర్ బాటిళ్లను తయారు చేసి స్టిక్కర్లను సైతం ఇక్కడే అతికించి మార్కెట్లోకి పంపుతున్నట్లు అధికారులు గుర్తించారు.

9 బృందాలతో తనిఖీలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లోని శుద్ధ జలాల ప్లాంట్లలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపిన వివరాల మేరకు... ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఏక కాలంలో 9 బృందాలతో తనిఖీలు నిర్వహించాం. తనిఖీలో భాగంగా నీటి వ్యాపారం చేస్తున్న ప్లాంట్ల యజమానుల లైసెన్స్‌లను, ప్లాంట్‌లో శుభ్రతకు తీసుకుంటున్న చర్యలను గుర్తించాం. అదేవిధంగా నీటిని బాటిళ్లలో, ప్యాకెట్లలో నింపి ప్యాకింగ్ చేసే విధానంతో పాటు నాణ్యత పరిశీలించాం. ఇందులో భాగంగా నీటి నమూనాలను నాణ్యత పరిశీలించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులతో శాంపిళ్లను సేకరించి, వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపాము.

బ్రాండ్ లేబుళ్లతో మోసం..

అనంతపురంలోని నందిని మినరల్ వాటర్ ప్లాంట్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌లో ఫిల్టర్ పని చేయడం లేదు. అయినా వ్యాపారులు బోరు నీటిని బాటిళ్లలో నింపి మార్కెట్‌లోకి విక్రయాలకు పంపుతున్నారు. దీనికి తోడు వాటర్ ప్లాంట్ వారు అనుమతి పొందిన బ్రాండ్‌నే కాకుండా హైదరాబాద్, కర్ణాటకకు చెందిన బ్రాండులకు సంబంధించిన లేబుళ్లను అతికించి వ్యాపారం చేస్తున్నారు. శుద్ధ జలం పేరుతో చేస్తున్న దందాకు సంబంధించి రిపోర్ట్ ద్వారా విజిలెన్స్‌అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి నివేదిక పంపాము. ఉన్నతాధికారులు, ల్యాబ్ ఎనాలిసిస్ రిపోర్ట్ వచ్చిన అనంతరం ఈ అక్రమాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో దాడులు చేసింది ఇక్కడే...

- **అనంతపురంలో:** నందిని మినరల్ వాటర్ ప్లాంట్, శ్రీలేఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ , శ్రీవర ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్
- **తాడిపత్రిలో:** ఎస్.ఆర్. ఆక్వా ఉత్పత్తి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, పెన్నా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్
- **కదిరిలో:** సాయి నంది ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్, గంగోత్రి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్
- **హిందూపురంలో :** రఫిక్ వాటర్ ప్లాంట్, లహరీ ఫిల్టర్ వాటర్, మినరల్ వాటర్

ఇరువర్గాలపై కేసుల నమోదు

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరిలో గురువారం జరిగిన ఘర్షణలపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. మెచ్చిరి గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు గొని గొల్ల హనుమంతరెడ్డి, గొని గొల్ల భీమప్ప, గొల్ల కిష్టప్ప,గొల్ల శివణ్ణ, మేకల శివరాజు మరికొంతమందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే గొని గొల్ల భీమన్న ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు నామాల చంద్రశేఖర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రామాంజి, నరసింహారెడ్డి, హనుమంతరెడ్డి, కృష్ణారెడ్డితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశామన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

- తండ్రి సబ్‌జైలుకు, కుమారుడు బాలనేరస్తుల గృహానికి తరలింపు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట జగనన్నకాలనీలో కలకలం రేపిన ఆశాబీ అనే మహిళ హత్య కేసులో నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం డీఎస్పీ మహబూబ్‌బాషాకు పక్కా సమాచారం రావడంతో రూరల్ సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్‌ఐ నబీరసూల్ సిబ్బంది అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆశాబీ మాజీ భర్త తపాల్ బాబా, కుమారుడు నూర్‌మహ్మద్ వలిని కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు తపాల్‌బాబాను సబ్‌జైలుకు, కుమారుడు మైనార్ కావడంతో బాల నేరస్తుల గృహానికి తరలించారు.





అసత్య ప్రచారం చేస్తే కేసులు

- ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తే చర్యలు
- ఇప్పటికే రెండు సంస్థలపై కేసులు నమోదు చేసిన పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో ఈ ఏడాది ' 14 రోజుల్లో 16 మంది అమ్మాయిల అదృశ్యమంటూ అసత్య ప్రచారం చేసిన రెండు సామాజిక మాధ్యమాలకు సంబంధించిన సంస్థలపై అనంత పోలీసులు కేసులు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపిన వివరాలమేరకు.. ప్రజలను తప్పుదారి పట్టించి ఆందోళనకు గురిచేసే కథనాలను సామాజిక మాధ్యమాల్లో కొంత మంది ప్రసారం చేస్తున్నారు. వాట్సాప్, ఇతర మాధ్యమాల ద్వారా అనంతలో ఏదో జరిగిపోతోందన్న పరిస్థితులను కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసత్యాలను ప్రచారం చేస్తున్న రెండు సంస్థలపై కేసులు నమోదు చేశాం. క్రైం నంబర్ 25/2023 505 (2) ఐపీసీ అండ్ సెక్షన్ 74 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. ఈ మేరకు ఆ సంస్థల ప్రతినిధులు, వాట్సాప్‌లో పోస్టులు పెట్టిన ఆయా సంస్థల సిబ్బందికి కూడా నోటీసులు జారీ చేసేందుకు దర్యాప్తు చేపట్టాం. ఈ కేసు దర్యాప్తులో భాగంగా చేసిన పోస్టులను నిర్ధారించుకోకుండా తిరిగి సోషల్ మీడియాలో వాటినే పోస్ట్ చేసిన వారిని సైతం వదిలేది లేదన్నారు. వారికి కూడా నోటీసులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో అలజడి, ఆందోళన రేకెత్తేలా తప్పుడు సమాచారాలను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌లో శుక్రవారం సాయంత్రం అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఎస్‌డీటీ చెన్నకేశవనాయుడు తెలిపారు. శాంతినగర్‌కు చెందిన నారాయణస్వామి, సంజయ్‌నగర్‌కు చెందిన జింకా శివకుమార్ శాంతినగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకుని అక్రమంగా 90 రేషన్ బియ్యం ప్యాకెట్లను నిల్వ చేశారన్న సమాచారంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

కట్నం తేవాలని వేధిస్తున్న భర్త అరెస్ట్

ముదిగుబ్బ: మండల పరిధిలోని రామస్వామి తండాకు చెందిన పుష్పలత అనే మహిళ తన భర్త శ్రీకాంత్ నాయక్ అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు గురిచేస్తున్నట్లు శుక్రవారం పట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని శ్రీకాంత్ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు.

యూనిఫాం ధరించని వారికి జీతం కట్

ఎన్పీకుంట: విధులను నిర్లక్ష్యం చేస్తూ యూనిఫాం ధరించని సచివాలయ సిబ్బందికి ఒక రోజు జీతం నిలుపుదల చేసినట్లు ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. ఈ నెల 18న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ మండలంలోని వెలిచలమల, గొకనపల్లి, మరికొమ్మదిన్నె సచివాలయాలను తనిఖీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యూనిఫాం ధరించని సచివాలయ సిబ్బందికి కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక రోజు జీతం నిలుపుదల చేసినట్లు తెలిపారు. వెలిచలమల, గొకనపల్లి సచివాలయాలకు చెందిన డిజిటల్ అసిసెట్టంట్లు టి.గంగయ్య, కె.గురుప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్లు మహమ్మద్ షఫీవుల్లా, వెంకటేశ్వరనాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమరసింహారెడ్డి, గునకిషోర్‌రెడ్డి, మహిళా పోలీసులు సుష్మిత, మోక్షలక్ష్మి, గొకనపల్లి సిరికల్చర్ అసిస్టెంట్ శ్రీక్రిష్ణనాయక్, ఏఎన్‌ఎమ్ ఉషారాణి ఉన్నారన్నారు. వారందరికీ 18వ తేదీకి సంబంధించి ఒక రోజు జీతం నిలుపుదల చేసినట్లు వివరించారు.

మెదటి ప్రాధాన్యతా ఓటు వేయండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి



కరపత్రాలు చూపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీచేస్తున్న తనకు మెదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉపాధ్యాయ, పట్టభద్రులను కోరారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలో ఇంటింటికీ వెళ్లి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డికి, రాయసీమ పట్టభద్రల నుంచి పోటీ చేస్తున్న తనకు మెదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు మధు, ప్రతాప్‌రెడ్డి, సాంబశివారెడ్డి, రామ్మోహన్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రోత్సాహకాలు

- మత్స్యశాఖ డీడీ డాక్టర్ శాంతి

అనంతపురం అగ్రికల్చర్: చేపలు, రొయ్యలు, పీతలు... ఇలా మత్స్య, అక్వా రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి ఒక్కరూ మత్స్యశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.శాంతి తెలిపారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహక రాయితీలు అందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని సూచించారు. మత్స్యకార సహకార సంఘాల పరిధిలోని చేపల పెంపకందారులు, చేపల పట్టే (వేట) వారు, సరఫరా, అమ్మకందారులతోపాటు సొంతంగానూ చేపలు పెంచుతూ క్రయ విక్రయాలు చేసే వారంతా తమ వివరాలు అందజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సంప్రదాయ మత్స్యకారులతో పాటు ఈ రంగంపై ఆధారపడిన ప్రతి ఒక్కరూ వివరాలు అందించాలన్నారు. పూర్తిస్థాయి డేటా అందుబాటులోకి వస్తే రీటైల్ షాపులు, హోల్‌సేల్‌షాపులు, హబ్‌లకు అనుసంధానం చేసి మత్స్యకారులకు స్థిరమైన ధర కల్పించడంతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలతో నాణ్యమైన తాజా చేపలు, వాటి ఉత్పత్తులు అందించడానికి వీలవుతుందన్నారు. వివరాలు నమోదు చేయాలనుకునే వారు విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్లు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ఎఫ్‌డీఓ), ఏడీ, డీడీలతో పాటు ఆయా కార్యాలయాల్లోనూ సంప్రదించవచ్చన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



ఆదర్శ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

అమడగూరు: పశ్చిమ రాయలసీమకు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె అమడగూరు, మహమ్మదాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో పర్యటించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎం.వీ.రామచంద్రారెడ్డి, అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి పోటీ చేస్తున్నారని వారిని గెలిపించాలని కోరారు. అనంతరం అభ్యర్థులుగా ఉన్నవారు చేస్తున్న సేవా కార్యక్రమాలు, సమస్యల సాధనకు చేసిన పోరాటాల కృషిని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప, ప్రధానోపాధ్యాయులు రమణ, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, చంద్రమౌళిరెడ్డి పీఈటీ రాజేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మండల పరిధిలోని పలు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు **9912220717**

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.